# అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

- ఈ ప్రాంత వాసిగా ఆదివాసీల సమస్యలన్నీ నాకు తెలుసు
- బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు
- మావోయిస్టుల ప్రభావిత గ్రామాల్లో ప్రచారం.. గిరిజనుల స్వాగతం..




తిప్పాపురంలో తెల్లం వెంకట్రావుకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, శివలింగాపురం చేరికలు

చర్ల, నవంబర్ 3: ఈ ప్రాంత వాసిగా ఇక్కడి ఆదివాసీల సమస్యలన్నీ తనకు తెలుసునని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు అవకాశమిస్తే ఈ గిరిజన ప్రాంతాలన్నింటినీ అభివృద్ధి చేసి చూపిస్తానని మాట ఇచ్చారు. గులాబీ శ్రేణులతో కలిసి చర్ల మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. సరిహద్దు గ్రామాలైన తిప్పాపురం, ఉయ్యాలమడుగు, చలిమల, పెద్దమిడిసిలేరు, చిన్నమిడిసిలేరు, కలివేరు, శివలింగాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయని అన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే మరిన్ని కొత్త పథకాలన సీఎం కేసీఆర్ అమలు చేస్తారని అన్నారు. రాష్ట్రంలో మూడోసారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కాగా, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఈ గ్రామాల్లో ఆదివాసీలందరూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహిళలు బొట్టు పెట్టి హారతులు పట్టారు. ఈ సందర్భంగా గిరిజనులందరూ 'జై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు. కాగా, ఈ ప్రచారం సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారందికీ తెల్లం వెంకట్రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణ, సోయం రాజారావు, పోలిన లంకరాజు, కొటేరు శ్రీనివాసరెడ్డి, గీద కోదండరామయ్య, కొసరాజు కుమార్‌రాజా, కాపుల నాగరాజు, కాపుల కృష్ణార్జునరావు, శోభారాణి, అజీజ్, రాజబాబు, సీతాపతిరాజు, కాకి అనిల్, పంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతోనే సామాన్యులకు మేలు

- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న పూర్ణచంద్రరావు

భద్రాచలం, నవంబర్ 3: సామాన్యులకు మేలు చేసే విధంగా బీఆర్ఎస్ అధిష్ఠానం ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించిందని ఎమ్మెల్సీ, పార్టీ భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జి తాత మధుసూదన్ అన్నారు. చర్ల రోడ్డులోని బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన పార్టీ అభిమాని తూతుక ప్రకాశ్ ఎన్నికల ప్రచార ద్విచక్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రకాశ్ గతంలో సైకిల్‌పై ప్రచారం చేసేవారని, ఆయన సేవలను గుర్తించిన పార్టీ ద్విచక్ర వాహనాన్ని అందజేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తిప్పన సిద్ధులు, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు తాండ్ర వెంకట రమణారావు, దారపునేని రాంబాబు, రత్నం రమాకాంత్, చింతాడి చిట్టిబాబు పాల్గొన్నారు.

### భద్రాచలం పట్టణంలో..

భద్రాచలం, నవంబర్ 3 : గ్రామాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని 140, 141 బూత్‌ల బీఆర్ఎస్ ఇన్‌చార్జి రేపాక పూర్ణ చంద్రరావు అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తాతగుడి సెంటర్‌లో 138వ బూత్ ఇన్‌చార్జి తాండ్ర నరసింహారావు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శాంతినగర్ కాలనీలో 149వ బూత్ ఇన్‌చార్జులు దారపునేని రాంబాబు, దుద్దుకూరి సాయిబాబా ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

### ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

**అన్నె సత్యనారాయణమూర్తి**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి

దుమ్ముగూడెం, నవంబర్ 3: ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపించుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి అన్నారు. లక్ష్మీనగరంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, పార్టీ అధికార ప్రతినిధి జానీపాషా, నాయకులు తునికి కామేశ్వరరావు, వీర్రాజు, కాటిబోయిన వెంకటేశ్వర్లు, సోడె కొండయ్య, తెల్లం రామకృష్ణ, సరియం సీతారాం, తెల్లం రామకృష్ణ, దామెర్ల శ్రీనివాసరావు, అల్లాడి వెంకటేశ్, జిలకర గంగరాజు, కుంజా నాగేశ్వరరావు, పొడియం సుబ్బారావు, మోతుకూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

# భద్రతను ఇంటినుంచే మొదలుపెడదాం : జీఎం(సేఫ్టీ) గురవయ్య

రామవరం, నవంబర్ 3 : ప్రతి ఉద్యోగి ఇంటి నుంచే భద్రతను మొదలుపెట్టాలని జీఎం(సేఫ్టీ) గురవయ్య అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే పద్మావతి ఖని 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పీవీకే పద్మావతి ఖనిని రక్షణ తనిఖీ బృందం లలిత్ కుమార్, శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, ఎస్.సదానందం, అబ్దుల్ నబీ, అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణ ప్రసాద్, యావ శ్రీనివాస్, బి.సురేష్, పృథ్వీరాజ్ పరిశీలించారు. ఈ కమిటీ సభ్యులు పీవీకే పద్మావతి ఖని, పీవీకే 5 ఇంక్లైన్ గనిలో పర్యటించారు. అనంతరం ఏరియా జీఎం శాలెంరాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ పీవీకే 5 ఇంక్లైన్ గనిలో ఎస్ఎంపీ(సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్)ని మంచిగా పాటిస్తున్నారని, రక్షణ సూత్రాలపై మంచి అవగాహన కలిగి ఉన్నారని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని, భద్రత అనేది ఇంటి నుంచే మొదలుపెట్టడం వల్ల మన భద్రత మన బాధ్యత నిర్వర్తించుకోవాలని అన్నారు. ప్రతి కార్మికుడు విధిగా ఒక గంటసేపు ఏదైనా వ్యాయామాన్ని చేసుకొని ఆరోగ్య పరిరక్షణ కోసం పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎంపీని అమలు చేసిన కార్మికులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గని ఏజెంట్ బూర రవీందర్, మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, ఇన్‌చార్జి అసిస్టెంట్ సేఫ్టీ ఆఫీసర్ డీవీఎస్ శర్మ, ఎస్‌వో కిశోర్‌బాబు, అధికారులు, కార్మికులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

## రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం, నవంబర్ 3: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అర్చకులు అంతరాలయంలోని మూలవరులకు బెంగళూరుకు చెందిన భక్తులు రూ.5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను అలంకరించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం చేపట్టారు.

## జమా ఖర్చుల నమోదుకు అభ్యర్థులు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలి



మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ అజయ్ లాల్ చంద్ సోనేజీ

భద్రాచలం, నవంబర్ 3 : ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు జమా ఖర్చుల నమోదుకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలని ఎన్నికల అబ్జర్వర్ అజయ్ లాల్‌చంద్ సోనేజీ అన్నారు. భద్రాచలంలోని ఆర్డీవో కార్యాలయయంలో శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, అకౌంటింగ్, వీడియో వీవింగ్ బృందాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10వరకు నామినేషన్ల స్వీకరణ ప్రకియ చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలన్నారు. నామినేషన్ కేంద్రానికి వచ్చే వాహనాలను 100 మీటర్ల దూరంలోనే నిలిపివేయాలన్నారు. అభ్యర్థితో కలిసి కేంద్రంలోకి ఐదుగురిని మాత్రమే అనుమతించాలన్నారు. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల ఖర్చు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఆర్డీవో మంగీలాల్, పట్టణ సీఐ నాగరాజ్ రెడ్డి, ఎక్సైజ్‌శాఖ సీఐ రహీమున్నీసా బేగం పాల్గొన్నారు.

## నాటుసారా విక్రేత అరెస్టు

దుమ్ముగూడెం, నవంబర్ 3: నర్సాపురంలో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అటుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఆపి సోదా చేశారు. వాహనదారుడి వద్ద ఎనిమిది లీటర్ల నాటుసారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఏపీలోని ఎటపాకకు చెందిన మాలోతు రాంపతిగా గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## 'ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తప్పనిసరి'



మాట్లాడుతున్న డీపీఆర్‌వో శ్రీనివాస్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 3 : సర్వీస్ ప్రొవైడర్లు సెల్ కంపెనీలు బల్క్ ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ ద్వారా చేసే ఫోన్‌కాల్స్‌కు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తీసుకోవాలని డీపీఆర్‌వో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలోని డీపీఆర్‌వో కార్యాలయంలో సర్వీస్ కంపెనీ అధికారులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముందస్తు అనుమతి లేకుండా బల్క్ ఎస్ఎంఎస్‌లు, ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్‌కాల్స్ చేయడానికి వీలులేదన్నారు. సమావేశంలో ఎస్పీ కార్యాలయం నుంచి నరేన్, సోషల్ మీడియా కమిటీ సభ్యులు దిలీప్, బీఎస్ఎన్ఎల్ నుంచి సక్రు, సూపరింటెండెంట్ శివరాంజీ, జియో నుంచి బండి విజయభాస్కర్ పాల్గొన్నారు.